సాక్షి
అనకాపల్లి
గురువారం । 9 । అక్టోబర్ । 2025



మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో 60 శాతం నిర్మాణం పూర్తయిన మెడికల్ కాలేజీ భవనం

మాజీ సీఎం జగన్ పర్యటన ఇలా..



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం, పెందుర్తి, సబ్బవరం-అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా కొత్తూరు జంక్షన్.. అక్కడ నుంచి తాళ్లపాలెం జంక్షన్ మీదుగా మాకవరపాలెం మండలంలో భీమబోయినపాలెం మెడికల్ కళాశాలకు చేరుకుంటారు. అక్కడ కళాశాలను పరిశీలించి 1.30 నుంచి 2.15 గంటల వరకు మీడియాతో మాట్లాడతారు. అనంతరం విశాఖలోని కేజీహెచ్‌కు 4 గంటలకు చేరుకుంటారు. కురుపాం గిరిజన ప్రభుత్వ వసతి గృహంలో అస్వస్థతకు గురై ఇక్కడ చికిత్స పొందుతున్న గిరిజన బాలికలను పరామర్శిస్తారు. అక్కడ నుంచి విశాఖ ఎయిర్ పోర్టుకు సాయంత్రం 6 గంటలకు చేరుకొని విమానంలో తిరుగుపయనమవుతారు.

అడుగడుగునా ఆంక్షలు

- వైఎస్ జగన్ పర్యటనలో కేవలం మూడు చోట్ల మాత్రమే జనాన్ని అనుమతిస్తామంటున్న పోలీసులు
- ఒక్కో పాయింట్ వద్ద 500 మందికి మించి ఉండకూడదని నిబంధన



మెడికల్ కళాశాల వద్ద సూచనలిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

సాక్షి, అనకాపల్లి: కూటమి సర్కారుకు వణుకు పుట్టింది. మెడికల్ కాలేజీ అంశాన్ని మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం వికటిస్తోందని భయం పట్టుకుంది. అందుకే నర్సీపట్నంలో వైద్య కళాశాల ఏర్పాటుకు అసలు జీవోయే విడుదల కాలేదని, నిర్మాణమే జరగలేదని వాదించిన కూటమి నేతలు.. స్వయంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రంగంలోకి దిగుతుండడంతో కలవరపడుతున్నారు. మెడికల్ కాలేజీ అంశంలో అభాసుపాలవుతామన్న ఆందోళనతోపాటు జననేతను కలిసేందుకు వచ్చే జన సంద్రాన్ని చూసి పరువు పోతుందన్న బెంగ వారిని వెంటాడుతోంది. అందుకే గురువారం వైఎస్ జగన్ పర్యటనకు అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ అవాంతరాలు కల్పిస్తున్నారు. తొలుత రోడ్ షో కుదరదు.. హెలిప్యాడ్‌కు అనుమతి కోరితే పరిశీలిస్తామన్న పోలీసు అధికారులు.. చివరకు విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి మాకవరపాలెం మండలంలోని భీమబోయినపాలెం రోడ్డు మార్గంలో వెళ్లేందుకు అనేక ఆంక్షలతో అనుమతించారు.

మూడుచోట్ల 500 మందికి మించి జనం రాకూడదు..

ఎట్టకేలకు రోడ్డు మార్గంలో వెళ్లేందుకు అనుమతించిన పోలీసులు.. కొత్త మెలికలు, కొర్రీలు పెట్టారు. భారీగా జనం తరలివస్తారని నివేదికలు ఉన్నాయని.. కార్యక్రమానికి ఎంతమంది హాజరవుతారు.. పాల్గొనే వాహనాల సంఖ్య ఎంత.. స్పష్టం చేయాలని వైఎస్సార్ సీపీ నేతలను అడుగుతున్నారు. పోలీసుల అనుమతి ప్రకారం విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి మాకవరపాలెం మెడికల్ కళాశాల వరకు పెందుర్తి, అనకాపల్లి కొత్తూరు జంక్షన్, తాళ్లపాలెం జంక్షన్ల వద్ద మాత్రమే జనం ఉండాలి. మిగిలిన చోట్ల ఎక్కడా కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలవకూడదని పోలీసులు ఆంక్షలు పెడుతున్నారు. అక్కడ 500 మంది మించి జనం ఉండకూడదంటూ బెదిరిస్తున్నారు. వైఎస్ జగన్‌పై ప్రజాభిమానాన్ని నిర్వాహకులు ఎలా లెక్కకట్టి చెప్పగలుగుతారు? తమ ప్రియతమ నాయకుడికి సమస్యలు చెప్పుకునేందుకు సామాన్య ప్రజలు వచ్చి వినతి పత్రాలు ఇస్తారు.. ఆయన తీసుకుంటారు. ఇక్కడ కూడా పోలీసు ఆంక్షలేనా అంటూ సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది.

పర్యటనకే అనుమతి.. ఫ్లెక్సీలకు కాదు

అనకాపల్లి నుంచి తాళ్లపాలెం వరకు జాతీయరహదారిని ఆనుకుని మాజీ సీఎం పర్యటన మార్గంలో ఫ్లెక్సీలు పెట్టవద్దని పోలీసులు బుధవారం ఓవరాక్షన్ చేశారు. పర్యటనకే పర్మిషన్.. ఫ్లెక్సీలకు కాదంటూ వాగ్వాదం పెట్టుకున్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు ఎదురుతిరిగి.. రోడ్డుపై ఉన్న కూటమి పార్టీల ఫ్లెక్సీలన్నీ ముందు తొలగించమని డిమాండ్ చేశారు. కూటమి పార్టీలకు ఒక న్యాయం, మాకొక న్యాయమా అంటూ ప్రశ్నించారు. దీంతో పోలీసులు చల్లగా జారుకున్నారు. ఇలా జిల్లాలో అనేకచోట్ల ఆటంకాలు కల్పించారు.

నేతల గృహ నిర్బంధానికి సన్నాహాలు

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన నేపథ్యంలో ఈనెల 9వ తేదీన ఎవరూ వెళ్లకూడదు.. జనాన్ని తీసుకెళ్లకూడదంటూ పోలీస్‌స్టేషన్ల నుంచి వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు ఫోన్ చేసి బెదిరిస్తున్నారు. అనకాపల్లి టౌన్, రూరల్, కశింకోట, యలమంచిలి రూరల్, యలమంచిలి టౌన్, నర్సీపట్నం టౌన్, రూరల్, చోడవరం టౌన్ పోలీసులు వైఎస్సార్ సీపీ ద్వితీయశ్రేణి, తృతీయశ్రేణి నాయకులకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ముఖ్యనేతలు, మండల, గ్రామ స్థాయి నాయకులను హౌస్ అరెస్టులు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

భద్రతపై ఎస్పీ సమీక్ష

మాకవరపాలెం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలో భద్రతపై ఎస్పీ తుహిన్ సిన్హా సమీక్షించారు. మండలంలోని భీమబోయినపాలెం వద్ద గల మెడికల్ కళాశాల భవనాలను ఆయన బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణానికి జగన్ కాన్వాయ్ చేరుకునే మార్గం, మీడియాతో మాట్లాడనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. పర్యటన సందర్భంగా భద్రతాపరంగా ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. అలాగే కళాశాల ప్రాంగణం మొత్తం డాగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) దేవప్రసాద్, నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.

నర్సీపట్నం వైద్య కళాశాలపై.. కూటమి కత్తి!

- 2022, డిసెంబర్ 30న ప్రభుత్వ మెడికల్ కాలేజీకి శంకుస్థాపన
- రూ.500 కోట్లు కేటాయించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 50 ఎకరాల్లో 13.21 లక్షల చ.అ. విస్తీర్ణంలో భవన నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలో నిర్మాణ పనులు పరుగులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ పనులకు బ్రేకులు
- కాలేజీని పీపీపీ పేరుతో ప్రైవేటుకు అప్పగించాలని కుట్రలు



2022 డిసెంబర్ 30న నర్సీపట్నం మెడికల్ కాలేజీకి శంకుస్థాపన చేస్తున్న నాటి సీఎం వైఎస్ జగన్

విశాఖ సిటీ: రాష్ట్రంలో అన్ని జిల్లాలను కలుపుతూ ఒక మెడికల్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడిచేందుకు సిద్ధమైంది. ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ వైద్య కళాశాల ఉండాలన్న గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యాన్ని కాలరాసే పన్నాగాలు పన్నుతోంది. పేదలకు వైద్య విద్యతో పాటు.. అత్యాధునిక వైద్య సదుపాయాలు అందించేందుకు గతంలో శ్రీకారం చుడితే.. కూటమి ప్రభుత్వం వాటిని పీపీపీ పేరుతో ప్రైవేటుకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తోంది. పేద, బడుగు, బలహీన వర్గాలకు వైద్య విద్య, వైద్యాన్ని దూరం చేయాలని కంకణం కట్టుకుంది. 2022, డిసెంబర్ 30న అప్పటి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నర్సీపట్నంలో మెడికల్ కాలేజీ పనులకు శంకుస్థాపన చేయగా.. ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి ఈ కళాశాల నిర్మాణాన్ని అడ్డుకోవడానికి చంద్రబాబు అండ్ కో విశ్వప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

అనకాపల్లిలో ఏర్పాటు చేయకుండా అడ్డంకులు

రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుడితే వాటిని అడ్డుకోవడానికి చంద్రబాబు గ్యాంగ్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. ప్రధానంగా అనకాపల్లి జిల్లాలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించింది. తొలి విడతలో అనకాపల్లి టౌన్‌లో ఏర్పాటుకు 50 ఎకరాల స్థలాన్ని కేటాయించగా.. స్థానిక టీడీపీ నేతలు న్యాయస్థానాల ద్వారా అడ్డుకున్నారు. దీంతో అనకాపల్లి నుంచి నర్సీపట్నం నియోజకవర్గానికి వైద్య కళాశాలను తరలించాల్సి వచ్చింది. ఈ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తయితే గ్రామీణ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. అలాగే ఏటా 150 ఎంబీబీఎస్ సీట్లలో విద్యార్థులకు ప్రవేశం లభిస్తుంది. తర్వాత పీజీ వైద్య కోర్సులు వస్తాయి. తద్వారా పీజీ వైద్య విద్యార్థులు, వారికి వైద్య విద్య బోధించే ప్రొఫెసర్లు (నిపుణులైన వైద్యులు) అందుబాటులోకి వస్తారు. వారు ప్రభుత్వ ఉద్యోగులు కాబట్టి అక్కడే నివాసం ఉండాల్సి ఉంటుంది. దీంతో గ్రామీణ ప్రజలకు 24 గంటలూ అత్యవసర వైద్యం అందుతోంది. కానీ ఈ ప్రభుత్వ వైద్య కళాశాలను కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో ప్రైవేటుకు అప్పగించాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో వాటిని కౌంటర్ చేయలేక కిందామీదా పడుతోంది. ఇది కూటమికి ప్రతికూల ప్రభావాన్ని చూపించే అవకాశం ఉండడంతో అసలు వైద్య కాలేజీ నిర్మాణాలే జరగలేదని మంత్రులు అబద్ధాలకు తెరతీశారు.

వందేళ్ల తర్వాత ప్రభుత్వ వైద్య కళాశాల

ఉత్తరాంధ్రలో 1921లో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. వందేళ్ల తర్వాత గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నర్సీపట్నం, పాడేరుల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయించింది. 2022, డిసెంబర్ 30న అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఈ ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2025 నాటికి పూర్తి చేయాలనే సంకల్పంతో 50.15 ఎకరాల్లో 13.21 లక్షల చ.అ. విస్తీర్ణంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఏటా 150 ఎంబీబీఎస్ సీట్ల అడ్మిషన్లు చేపట్టాలని నిర్ణయించారు. వైఎస్సార్ సీపీ హయాంలోనే మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, ఇతర భవనాల నిర్మాణాలు జోరుగా సాగాయి. ఫుటింగ్ దశలో భవనాలు ఉండగా.. ఐటీడీ బ్లాక్, 24X7 బ్లాక్ స్లాబ్ వేయడం జరిగింది. మార్చురీ బ్లాక్, మెడికల్ గ్యాస్ ప్లాంట్, బయోమెడికల్ గ్యాస్ ప్లాంట్, ల్యాండరీ, ఆసుపత్రి కిచెన్ పనులు వేగంగా జరిగాయి. దాదాపు 60 శాతానికి పైగా నిర్మాణపనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కాలేజీ నిర్మాణాలకు బ్రేకులు పడ్డాయి.

అయ్యన్నా.. ఇదిగో జీవో



నర్సీపట్నం మెడికల్ కాలేజీ జీవో

నర్సీపట్నంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీకి జీవో కూడా లేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అవాస్తవాన్ని వల్లెవేశారు. ఆ జీవో ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. అయితే నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నర్సీపట్నంలో ప్రభుత్వ కాలేజీకి రూ.500 కోట్లు మంజూరు చేస్తూ 2022, ఆగస్టు 8న జీవో నెంబర్ 204ను విడుదల చేసింది. అంతకుముందు అనకాపల్లిలో ఏర్పాటు కోసం 2020, ఆగస్టు 24న జీవో నెంబర్ 374ను, 2021, మార్చి 23న జీవో నెంబర్ 33ను విడుదల చేసింది. ఈ జీవో ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉన్నప్పటికీ అయ్యన్నపాత్రుడు వక్రీకరించి జీవో లేదని అబద్ధాలు చెప్పడం గమనార్హం. జీవో ఉంటే చూపించాలని సవాల్ విసిరిన అయ్యన్నకు ఇప్పుడు వైఎస్సార్ సీపీ శ్రేణులు సోషల్ మీడియాలో వాటిని సర్క్యులేట్ చేస్తున్నారు. దీనిపై అయ్యన్న ఏం సమాధానం చెబుతారని ప్రశ్నలు సంధిస్తున్నారు.

కేజీహెచ్‌లో వద్దు.. కురుపాం వెళ్లిపోండి.!

- నీరసంగా ఉన్నా.. వైఎస్ జగన్ పరామర్శించకూడదనే నెపంతోనే డిశ్చార్జ్
- కేజీహెచ్‌లో మొత్తం 64 మంది చేరగా.. ఇప్పటికే 18 మంది డిశ్చార్జ్
- నేటి ఉదయం మరో 10 మందిని పంపించేందుకు సన్నాహాలు
- బాధిత విద్యార్థినుల ఆహారం విషయంలోనూ అదే నిర్లక్ష్యం

సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం కారణంగా.. ఇప్పటికే ఇద్దరు విద్యార్థినుల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. వంద మందికి పైగా విద్యార్థినులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అయినా ప్రభుత్వంలో కించిత్తు పశ్చాత్తాపం కనిపించలేదు. చికిత్స పొందుతున్న విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యతను విస్మరిస్తోంది. వైద్యం అందించడంలోనూ రాజకీయం చేస్తోంది. విశాఖలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఖరారవ్వడం..పచ్చకామెర్లతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించేందుకు వస్తున్నారని తెలుసుకున్న ప్రభుత్వం.. విద్యార్థుల ఆరోగ్యంతో ఆడుకుంటోంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పూర్తిగా నయమవ్వకుండానే విద్యార్థినులను కేజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేసేస్తున్నారు. బాబ్బాబూ.. పాప ఇంకా నీరసంగా ఉందయ్యా.. అని వేడుకుంటున్నా.. కేజీహెచ్‌లో వద్దు.. కురుపాం వెళ్లిపొండంటూ పంపించేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నా..

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలోని ఏకలవ్య పాఠశాల, దానిని ఆనుకొని ఉన్న గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో విషజ్వరాలు ప్రబలి ఇద్దరు విద్యార్థినులు మృత్యు ఒడికి చేరుకున్నారు. 120 మందికి పైగా ఆస్పత్రుల పాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో కురుపాం, పార్వతీపురం ఆస్పత్రుల నుంచి కేజీహెచ్‌కు 64 మంది విద్యార్థులను తరలించారు. ఆ సమయంలో వీరందరి ఆరోగ్యం కూడా కాస్తా విషమంగా ఉంది. ప్రతిరోజూ వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించి.. వైద్య సహాయక చర్యలపై ఆరా తీసిన తర్వాతే... విద్యార్థులకు వైద్య సేవలు ముమ్మరం చెయ్యడం ప్రారంభించారు. దీంతో పిల్లలు ఇప్పుడిప్పుడే కాస్తా కోలుకుంటున్నారు.

వైఎస్ జగన్ వస్తున్నారని..!

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను గురువారం సాయంత్రం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శిస్తారని తెలిసినప్పటి నుంచి కూటమి ప్రభుత్వానికి భయం పట్టుకుంది. కురుపాం ఘటనను బాహ్య ప్రపంచానికి తెలియకుండా మాఫీ చేసేందుకు ప్రభుత్వం యత్నించినా బట్టబయలైంది. ఇక వైఎస్ జగన్ వస్తే.. జాతీయ స్థాయి ఇష్యూగా మారుతుందనే ఆందోళన ప్రభుత్వంలో కనిపించింది. దీంతో విద్యార్థినుల ఆరోగ్యంతో చెలగాటమాడేందుకు కూడా వెనుకాడటం లేదు. హోంమంత్రి, ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో నీరసంగా ఉన్నా కనికరించకుండా విద్యార్థినులను కేజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేయడం మొదలుపెట్టారు. మంగళవారం రాత్రి 8 మందిని, బుధవారం రాత్రి ఆదరాబాదరాగా మరో 10 మందిని పంపించేశారు. శుక్రవారం ఉదయంలోపు మరో 10 మందిని పంపించేందుకు డిశ్చార్జ్ షీట్స్ సిద్ధం చేస్తున్నారు. పాప నీరసంతో నడవలేకపోతోంది.. రెండు రోజులు ఇక్కడ ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నా.. ఏం ఫర్వాలేదు.. మీరు కురుపాం పీహెచ్‌సీలో జాయిన్ అవ్వండంటూ డిశ్చార్జ్ షీట్‌లో రాసి మరీ పంపించేస్తుండటం దారుణం.



బుధవారం రాత్రి కేజీహెచ్ నుంచి డిశ్చార్జ్ చేసిన విద్యార్థినులు

ఆహారం విషయంలోనూ..

బాధిత విద్యార్థినుల ఆహారం విషయంలోనూ అదే నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారు. పచ్చకామెర్లతో బాధపడుతున్న వారికి తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి. కానీ కేజీహెచ్‌లో ప్రతిరోజూ అందరికీ అందించే ఉప్మా ఇచ్చారు. హోం మంత్రి అనిత పరామర్శించిన సమయంలో బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో.. తర్వాత నుంచి ప్రత్యేక మెనూ ఇస్తున్నారు. మొత్తానికి తమ రాజకీయం కోసం.. విద్యార్థుల ఆరోగ్యాన్ని కూడా కూటమి ప్రభుత్వం లెక్కచేయకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వైఎస్ జగన్ దృష్టికి మత్స్యకారుల ఆందోళన

- నేడు వినతిపత్రం ఇవ్వనున్న పార్టీ నాయకులు



నక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

నక్కపల్లి: రాజయ్యపేట సమీపంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గత 25 రోజులుగా మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం నక్కపల్లిలోని పార్టీ కార్యాలయంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, తదితరులు విలేకర్లతో మాట్లాడుతూ మెడికల్ కళాశాలల సందర్శనకు వస్తున్న వైఎస్ జగన్‌ను గురువారం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, మత్స్యకార నాయకురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, మత్స్యకార నాయకుడు ఎరిపల్లి నాగేశు తదితరులతో కలిసి, వినతిపత్రం అందజేస్తామన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ వల్ల కలిగే నష్టాన్ని తమ అధినేతకు వివరించి, మద్దతు కోరతామన్నారు. మత్స్యకారుల సమస్యలపై వైఎస్ జగన్‌ను కలిసేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, మత్స్యకారులు తరలిరావాలని వారు కోరారు.

పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లపై చర్చిస్తున్న బొత్స, తలశిల రఘురామ్, మాజీ మంత్రులు

మాకవరపాలెం: మెడికల్ కళాశాల భవనాలను సందర్శించేందుకు గురువారం భీమబోయినపాలెం వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఏర్పాట్లను శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రుల బృందం పరిశీలించింది. వైఎస్ జగన్ ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి విడదల రజని, నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌లతో కలిసి బొత్స ఏర్పాట్లను సమీక్షించారు. పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పరిశీలకురాలు శోభా హైమావతి, భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మజ్జి శ్రీనివాసరావు, మండల స్థాయి నేతలు పాల్గొన్నారు.

స్పీకర్ ఒత్తిడితో కట్టడికి యత్నాలు

- పోలీసులపై మాజీ ఎమ్మెల్యే గణేష్ ఆరోపణ
- జగన్ పర్యటన విజయవంతం చేయాలని పిలుపు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

మాకవరపాలెం: స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఒత్తిడితో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు జనం రాకుండా పోలీసులు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. గురువారం జరగనున్న జగన్ పర్యటన నేపథ్యంలో మెడికల్ కాలేజీ వద్ద నుంచి మాట్లాడిన వీడియోను ఉమాశంకర్‌గణేష్ బుధవారం మీడియాకు విడుదల చేశారు. ఇప్పటికే పోలీసులు వైఎస్సార్‌సీపీ నేతలకు బెదిరింపులతో పాటు నోటీసులు ఇచ్చారన్నారు. నేతలపై ఆంక్షలు విధించడమే కాకుండా కళాశాల వద్దకు జనాన్ని రాకుండా ఆటో డ్రైవర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి పోలీసులు ఆదేశాలు జారీ చేశారని విమర్శించారు. వైద్య కళాశాల చుట్టూ ఉన్న దారులపై డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారని చెప్పారు. ఈ ప్రాంత ప్రజల కోసం జగన్ వస్తున్నారని, వేలాది మందికి మేలు చేయడమే లక్ష్యంగా 630 పడకలతో మెడికల్ కళాశాలను మంజూరు చేశారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ కాలేజీని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూడటాన్ని అందరూ వ్యతిరేకించాలన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు, నాయకులు ఎన్ని ఆంక్షలు విధించినా జగన్ పర్యటనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా వీసం రామకృష్ణ



అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా వీసం రామకృష్ణను నియమించారు. ఈ మేరకు బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. వీసం రామకృష్ణ పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ.. సంబంధిత రీజనల్ కోఆర్డినేటర్, అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులకు సహాయకారిగా వ్యవహరిస్తారు.

పీజీఆర్ఎస్ అర్జీలు ఆన్‌లైన్ తప్పనిసరి

- డివిజన్, మండల స్థాయిలోనూ చేయాలి
- అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం



రెవెన్యూ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల:

డివిజన్, మండల స్థాయిలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి రశీదు ఇవ్వాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీజీఆర్ఎస్, రీసర్వే, ఎంఎల్‌సీసీ, ఐవీఆర్ఎస్, నీటి తీరువా, కోర్టు కేసులు, సివిల్ సప్లయి, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, ఆర్‌వోఆర్ కోర్టు, దీపం-2 పథకం రీ పేమెంటు, ఓటరు మ్యాపింగ్ వంటి అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ అర్జీదారుడితో అధికారులు స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములను సర్వే చేసి, ఆక్రమణలు గుర్తించి నోటీసులు అందజేయాలన్నారు. మండల స్థాయి సమన్వయ కమిటీకి సిఫార్సు చేసిన సివిల్ కేసులను శత శాతం పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య సివిల్ తగాదాలకు సంబంధించి కౌన్సెలింగ్ ద్వారా పరిష్కారం చూపాలన్నారు. నీటి తీరువా వసూలు పెంచాలన్నారు. కోర్టు కేసులు పూర్తి చేయాలని, ప్రతి శనివారం ఆర్‌వోఆర్ కోర్టు నిర్వహించాలని సూచించారు.

మొదటి విడత రీ సర్వే పూర్తయిందని, రెండో విడత సర్వేలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలన్నారు. మూడో విడత రీ సర్వే మొదలు పెట్టిన 30 గ్రామాల్లో ప్రభుత్వ భూములను గుర్తించి హద్దులు నిర్ణయించాలని, రికార్డుల శుద్ధీకరణ చేయాలని ఆదేశించారు. రేషన్ షాపులు, బియ్యం బిల్లు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను తహసీల్దార్లు, సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ శత శాతం పూర్తి చేయాలన్నారు. దీపం పథకానికి సంబంధించి నిధుల జమలో సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఓటరు జాబితాలకు సంబంధించి వెరిఫికేషన్ పూర్తి చేసిన అనంతరం ప్రతి ఓటరును మ్యాపింగ్ చేయాలన్నారు. ఫారం 6కు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, రెవెన్యూ డివిజనల్ అధికారులు వి.వి.రమణ, షేక్ ఆయిషా, జిల్లా సప్లయి అధికారి మూర్తి, సర్వే సహాయ సంచాలకుడు గోపాలరాజు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏయూ స్నాతకోత్సవం వాయిదా

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ 91, 92 సంయుక్త స్నాతకోత్సవాన్ని వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న బీచ్ రోడ్డులో ఉన్న ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ స్నాతకోత్సవాన్ని నిర్వహించాల్సి ఉండగా.. తాత్కాలికంగా వాయిదా వేసినట్లు చెప్పారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామన్నారు.

చౌడువాడ, కొత్తకోట డాక్టర్లకు కలెక్టర్ అభినందన



వైద్యులను అభినందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి పొందిన చౌడువాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా స్థాయిలో ప్రథమబహుమతి పొందిన కొత్తకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కె.మాలంనాయుడు, కె.ఎం.సురేఖలను బుధవారం కలెక్టర్ విజయకృష్ణన్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి పథంలో నడిపించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ హైమావతికి సూచించారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు రిఫరీగా నాగజ్యోతి



రోలుగుంట: నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఫెడరేషన్, పవర్ లిఫ్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహిస్తున్న జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలకు రిఫరీగా రోలుగుంట హైస్కూల్‌లో ఇంగ్లిష్ టీచర్‌గా పని చేస్తున్న పి.వి.ఎం.నాగజ్యోతి ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈ నెల 9 నుంచి 12 వరకూ జరుగుతాయి. జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా ఎంపిక కావడం ఆనందంగా ఉందని నాగజ్యోతి తెలిపారు.

ఆటో డ్రైవర్లకు పోలీసుల ఆంక్షలు

బుచ్చెయ్యపేట: నర్సీపట్నంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ సందర్శనకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమానికి వెళ్తున్న ఆటో డ్రైవర్లకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఆరుగురి కంటే ఎక్కువ మందిని ఎక్కిస్తే కేసులు నమోదు చేస్తామని బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు సమావేశం ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్లను హెచ్చరించారు.

నూకాంబిక అమ్మవారి హుండీ ఆదాయం రూ.52.34 లక్షలు



హుండీలు లెక్కిస్తున్న సిబ్బంది

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం ఆలయ ఆవరణలో సోమవారం జరిగింది. ఈ ఏడాది జూన్ 16 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు రూ.52,34,361ల నగదు, 18.500 మిల్లీగ్రాముల బంగారం, కేజీ 400 గ్రాముల వెండి కానుకల రూపంలో వచ్చిందని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కె.ఎల్.సుధారాణి చెప్పారు. హుండీ పర్యవేక్షకుడు డి.వి.ఎస్.సురేష్‌బాబు, ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కట్టమంచికి అవమానం

- స్నాతకోత్సవం చరిత్రలో తొలిసారి వేదిక మార్పు
- కన్వెన్షన్ సెంటర్‌కు తరలింపుపై అభ్యంతరాలు
- తీవ్ర వ్యతిరేకతతో వెనక్కి తగ్గిన ఏయూ అధికారులు

విశాఖ సిటీ: ప్రతిష్ఠాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పాలకవర్గం తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏయూ పాలనపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే హాస్టళ్లలో సమస్యలు, పురుగుల భోజనం, విద్యార్థి మరణం వంటి అనేక వివాదాలు చుట్టుముట్టగా, తాజాగా స్నాతకోత్సవ వేదిక మార్పు అంశం అగ్గి రాజేస్తోంది. ఆంధ్రా యూనివర్సిటీ తొలి ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి(సీఆర్ రెడ్డి)ని అగౌరవపరిచేలా ఏయూ అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని వర్సిటీ వర్గాలు తీవ్రంగా తప్పుబడుతున్నాయి. కట్టమంచికి గౌరవార్థంగా ఏయూలో నిర్మించిన 'కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం(కాన్వొకేషన్ హాల్)'లోనే పట్టభద్రుల పట్టాల పండగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే.. చరిత్రలో తొలిసారిగా



కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం

స్నాతకోత్సవం వేదికను మార్చాలనే నిర్ణయంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కట్టమంచి నుంచి కన్వెన్షన్ సెంటర్‌కు..

ఏయూలో ఈ నెల 15న 91వ, 92వ స్నాతకోత్సవాలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. రెండేళ్ల పట్టభద్రులకు ఒకేసారి పట్టాలు అందించాలని నిర్ణయించారు. ఎప్పటిలాగే కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం హాల్‌లో కాన్వొకేషన్ జరుగుతుందని అందరూ భావించారు. అయితే.. ఈ స్నాతకోత్సవాన్ని అక్కడి నుంచి బీచ్ రోడ్డులో ఉన్న ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మార్చినట్లు అధికారులు ప్రకటించారు. దీనిపై ఏయూలో పలు వర్గాల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. స్నాతకోత్సవాన్ని ఉత్సవ రంగంలో కాకుండా వేరే చోట నిర్వహించడం కట్టమంచిని అవమానించడమే అన్న అభిప్రాయాలు బలంగా వ్యక్తమయ్యాయి.

ఈ అంశంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో.. కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం హాల్ మరమ్మతులకు గురైందన్న సాకును అధికారులు తెరపైకి తీసుకొచ్చారు. ఇప్పటివరకు జరిగిన అన్ని స్నాతకోత్సవాలు అక్కడే జరిగాయి. తాజాగా 91వ, 92వ కాన్వొకేషన్‌ను నిర్వహించాలని నిర్ణయించినప్పుడు, ఈలోపే మరమ్మతులు ఎందుకు పూర్తి చేయలేదన్న ప్రశ్నలను ఏయూలో కొందరు సంధిస్తున్నారు. ఏయూ ప్రారంభం నుంచి వస్తున్న సంప్రదాయానికి విరుద్ధంగా వ్యవహరించడాన్ని తప్పుబడుతున్నారు.

ఆలస్యంగా మరమ్మతులు

కట్టమంచి రామలింగారెడ్డి ఉత్సవ రంగం హాల్ మరమ్మతులకు గురైన మాట వాస్తవమే. పైన సీలింగ్ ఊడి పడే ప్రమాదం ఉంది. 91వ, 92వ కాన్వొకేషన్ నిర్వహించాలని నిర్ణయించడానికి ముందే ఈ మరమ్మతులను పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఆ పని చేయలేదు. ఇదిలా ఉండగా, ఇటీవల ఇందులో పని చేస్తున్న కార్మికుడొకరు పై నుంచి కిందపడి మరణించారు. దీంతో పోలీసులు తాత్కాలికంగా పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఫలితంగా మరమ్మతు పనులు మరింత ఆలస్యమయ్యాయి.

ఎన్–బ్రాండ్‌తో ప్రజల ప్రాణాలకు ముప్పు



కల్తీ మద్యం అరికట్టాలని నినాదాలు చేస్తున్న వైఎస్సార్ సీపీ మహిళా నేతలు

- కల్తీ మద్యంపై వైఎస్సార్‌సీపీ మహిళల ధర్నా
- ఎక్సైజ్ కార్యాలయం వద్ద బాటిళ్లు ధ్వంసం

బీచ్‌రోడ్డు (విశాఖ): రాష్ట్రంలో 'నారా వారి సారా', 'ఎన్ బ్రాండ్ లిక్కర్'తాగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని.. అటువంటి కల్తీ మద్యంను తక్షణమే అరికట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఆదేశాల మేరకు బుధవారం సిరిపురంలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయం వద్ద కల్తీ మద్యానికి వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా నాయకురాళ్లు మద్యం బాటిళ్లను ధ్వంసం చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అనంతరం పేడాడ రమణికుమారి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో లేని మద్యం కల్తీ ఉందని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత కల్తీ మద్యం వ్యాపారాన్ని విచ్చలవిడిగా కొనసాగిస్తోందని మండిపడ్డారు. కల్తీ మద్యం వ్యాపారం చేస్తూ పట్టుబడిన టీడీపీ నాయకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ ప్రభుత్వంలో మొదటి నుంచి ఇటువంటి కల్తీ మద్యం వ్యాపారాలు, లిక్కర్ స్కాములు సర్వసాధారణమని ఆమె ఆరోపించారు. 2014–19 మధ్యలో కూడా వేల కోట్లకు పైగా లిక్కర్ స్కామ్‌కు టీడీపీ ప్రభుత్వం పాల్పడిందన్నారు. ప్రస్తుతం దానికి మించి లిక్కర్ స్కామ్ జరుగుతోందని, ఇటీవల పట్టుబడిన కల్తీ మద్యం తయారీ కేంద్రమే ఇందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి స్కామ్‌లు లేకపోయినా.. అక్రమంగా తమ పార్టీకి చెందిన పలువురిని అరెస్టు చేసి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారన్నారు. అయితే న్యాయం తమ వైపే ఉంది కాబట్టి కోర్టుల ద్వారా వారు విముక్తి పొందారని రమణికుమారి గుర్తుచేశారు. మహిళల తాళిబొట్టులతో ఆటలాడుతున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్లే అనురాధ, రాష్ట్ర అధికార ప్రతినిధి మంచా నాగమల్లేశ్వరి, సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు రాధ, కార్పొరేటర్ శశికళ, జిల్లా అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు శ్రీదేవి వర్మ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, నాయకులు భాను, మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, తూర్పు, దక్షిణ, గాజువాక మహిళా విభాగం అధ్యక్షులు శిరీష, బంగారమ్మ, పల్లా చిన్నతల్లి, టీచర్స్ విభాగం ప్రతినిధులు కల్పన, జ్యోతి, పద్మావతి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్ తీరుపై మహిళ ఆగ్రహం

- వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో బస్సు ఆపేసి నిరసన
- నిలిచిపోయిన ట్రాఫిక్

బుచ్చెయ్యపేట: ఆర్టీసీ బస్సు డ్రైవర్ తీరును నిరసిస్తూ ఓ మహిళ వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆర్టీసీ బస్సును రోడ్డుపై ఆపేసి ఆందోళనకు దిగింది. మాడుగులకు చెందిన ఓ మహిళ పరవాడలో ప్రైవేటు కంపెనీలో పనిచేస్తోంది. మాడుగుల నుంచి వడ్డాది వచ్చి, వడ్డాది నుంచి తన కంపెనీ బస్సులో రోజూ విధులకు వెళ్లి వస్తుంటుంది. బుధవారం ఎప్పటిలాగే వడ్డాది రావడానికి మాడుగులలో విశాఖ–మాడుగుల ఆర్టీసీ బస్సు ఎక్కగా డ్రైవర్ ఈ బస్సు వడ్డాది వెళ్లదని చెప్పాడు. దీంతో ఆ మహిళ బస్సు దిగిపోయింది. డ్యూటీకి వెళ్లడానికి ఆలస్యమవుతోందని వడ్డాదిలో దింపమని తన భర్తను కోరింది. భర్త బైక్‌పై ఆమెను వడ్డాది తీసుకువచ్చాడు. అప్పటికే మాడుగులలో ఎక్కగా దింపేసిన ఆర్టీసీ బస్సు వడ్డాది జంక్షన్‌లో ఉండడంతో



ఆర్టీసీ బస్సు ముందు నిరసన తెలుపుతున్న మహిళ

ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. తాను అడిగితే వడ్డాది బస్సు వెళ్లదని సమాధానం చెప్పి, ఇప్పుడు వడ్డాది జంక్షన్‌కు బస్సును ఎందుకు తీసికొచ్చారని డ్రైవర్‌ను ప్రశ్నించింది. వడ్డాది నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఆర్టీసీ బస్సు ముందు నిలబడి నిరసనకు దిగింది.

ఆమెకు మద్దతుగా ఆమె కుటుంబ సభ్యులు నిలిచారు. దీంతో పాడేరు, చోడవరం, అనకాపల్లి, మాడుగుల వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర



నాలుగు రోడ్ల జంక్షన్‌లో నిలిచిపోయిన వాహనాలు

వాహనాలు ట్రాఫిక్‌లో నిలిచిపోయాయి. అర గంటకు పైగా వాహనాలు నాలుగు రోడ్ల జంక్షన్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. పలువురు అత్యవసరంగా వెళ్లాలని ఆ మహిళను వేడుకోవడంతో ఆర్టీసీ డ్రైవర్ సారీ చెప్పాలని డిమాండ్ చేసింది. డ్రైవర్ ఎంతకీ సారీ చెప్పకపోవడంతో నిరసన విరమించడానికి అంగీకరించలేదు. స్థానికులు, కుటుంబ సభ్యులు నచ్చజెప్పడంతో ఆ మహిళ ఎట్టకేలకు నిరసన విరమించింది.

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలి

- వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాద్



మునగపాక: నర్సీపట్నం నియోజకవర్గం మాకవరపాలెం మండలంలోని ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించేందుకు గురువారం వస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలకాలని ఆ పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రసాద్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రతి పేదవాడు చదువుకునేందుకు వీలుగా రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలలను గతంలో వైఎస్ జగన్ సర్కారు మంజూరు చేసిందన్నారు. వాటిలో ఇప్పటికే ఏడు కళాశాలల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. మిగతా కళాశాలల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. మాకవరపాలెం మండలంలో మెడికల్ కళాశాల నిర్మాణంలో ఉందన్నారు. అయితే ఇటీవల స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసలు ఇక్కడ మెడికల్ కళాశాల లేదని, జీవో కూడా లేదంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం విచారకరమని చెప్పారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు పన్నుతోందని తెలిపారు. ఇటువంటి చర్యలు సరికాదంటూ ప్రజలకు వివరించడంలో భాగంగా వైఎస్ జగన్ మాకవరపాలెం మండలంలో కళాశాలను సందర్శించేందుకు వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. విశాఖ ఎయిర్ పోర్ట్ నుంచి రోడ్డు మార్గాన కళాశాల ప్రాంగణానికి చేరుకుంటారని, పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి, ఘన స్వాగతం పలకాలన్నారు.

గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

చోడవరం: గంజాయి రవాణా కేసులో ఓ నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు వెలువరించిందని ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. 2015 నవంబరు 11వతేదీన చోడవరం పట్టణంలో కొత్తూరు జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సమయంలో గంజాయి రవాణా చేస్తున్న వి.మాడుగుల మండలం ముకుందపురం గ్రామానికి చెందిన ప్రగడ గణేష్ (38)ను పట్టుకుని, వందకిలోలను స్వాధీనం చేసుకున్నారు. అప్పటి ఎస్ఐ రమణయ్య కేసు నమోదు చేశారు. చోడవరం 9వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టు న్యాయమూర్తి రత్నకుమార్ ఈ కేసులో వాదనలు విని, నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష ఖరారు చేశారు. 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. లక్ష జరిమానా విధించారు. జరిమానా చెల్లించలేని పక్షంలో మరో ఏడాదిపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి హరినారాయణ తీర్పు చెప్పినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉగ్గిన వెంకటరావు అన్ని వివరాలు కోర్టుకు అందించడంతో నేరం రుజువైందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా అన్ని సాక్ష్యాధారాలు సేకరించిన వారందరికీ ఎస్పీ అభినందనలు తెలిపారు.

25వ రోజు కొనసాగిన మత్స్యకారుల ఆందోళన

నక్కపల్లి: బల్క్‌డ్రగ్‌పార్క్‌ను వ్యతిరేకిస్తూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళన 25వ రోజు బుధవారం కొనసాగింది. బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తూ తాము చేపట్టిన ఉద్యమంలో వెనుకడుగు వేసేప్రసక్తి లేదని వారు చెప్పారు. ఇతర జిల్లాల్లో వ్యతిరేకించిన ప్రమాదకర రసాయన పరిశ్రమలను మా ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ప్రాణాలొడ్డయినా సరే అడ్డుకుని తీరుతామన్నారు. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చే వివిధ రాజకీయ పార్టీ నాయకులను ప్రభుత్వం పోలీసుల సాయంతో అడ్డుకుంటోందని తెలిపారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఓట్లకోసం వచ్చినప్పుడు తమ సత్తా చూపిస్తామన్నారు. టీడీపీని నమ్మి రెండు వేల ఓట్ల మెజార్టీ ఇస్తే తగిన బుద్ధి చెప్పారని మండిపడుతున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన వెలువడే వరకు నిరాహార దీక్షకొనసాగిస్తామని మత్స్యకారులు తెలిపారు. ఈ దీక్షలో మాజీ ఎంపీటీసీ పిక్కి తాతీలు, మత్స్యకార నాయకులు మైలపల్లి సూరిబాబు, కర్రి చంద్రశేఖర్, సోమేష్, పిక్కిస్వామి, అప్పలరాజు, సూరి, కాశీ, నానాజీ మహేష్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



రాజయ్యపేటలో దీక్ష కొనసాగిస్తున్న మత్స్యకారులు

గురుకుల పాఠశాల విద్యార్థిని అదృశ్యం



నక్కపల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. పాఠశాల సిబ్బంది పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. మాకవరపాలెం మండలం శెట్టిపాలెం గ్రామానికి చెందిన ఎం.రామతులసి దసరా సెలవులకు ఇంటి వెళ్లి మంగళవారం తిరిగి పాఠశాలకు వచ్చింది. అదే రోజు రాత్రి సుమారు పదిగంటల సమయంలో పాఠశాల గోడ దూకి బయటకు వెళ్లినట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. రామతులసి ఇంటికి గాని, పాఠశాలకు గాని తిరిగి రాలేదు. పాఠశాల సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

- చెట్టుకింద ఉండగా ఘటన



రమణ మృతదేహం

చింతపల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి చెందిన ఘటన బెన్నవరం పంచాయతీ చిన కొత్తపాలెంలో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. నాతవరం మండలం మన్యపురట్ల గ్రామానికి చెందిన ముత్తా రమణ (54) ఏజెన్సీలో వ్యాపార నిమిత్తం తరచూ వస్తుంటాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం స్వగ్రామం మన్యపురట్ల నుంచి మండలంలోని చినకొత్తపాలెం గ్రామానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో వర్షం పడుతుండగా చెట్టు కింద ఆగాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండిస్తూ న్యాయవాదులు నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నర్సీపట్నం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ బార్ అసోసియేషన్ సభ్యులు బుధవారం బెంచ్‌ని బాయ్ కాట్ చేసి, నిరసన తెలిపారు. ఈ ఘటన జరగటం దురదృష్టకరమని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కె.అప్పలనాయుడు, జనరల్ సెక్రెటరీ శివకృష్ణ, కోశాధికారి వెంకటరమణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో...

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేయటం దుర్మార్గమైన చర్య అని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అన్నారు. అబిద్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని విమర్శించారనే నెపంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడి చేశారన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిపైనే దాడి జరిగితే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. వెనకబడిన వర్గాలపై మతోన్మాదుల దాడులు రోజురోజుకీ పెరుగుతున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి చేయడమంటే రాజ్యాంగంపై దాడి చేసినట్టేనన్నారు. ఈ ఘటనకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెల్లి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు వై.పాపారావు, గిరిజన సంఘ నాయకులు హరిప్రసాద్, తలుపులు, లోవరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో కుంభవృష్టి

- నాలుగు సెంటీమీటర్ల వర్షపాతం నమోదు

దేవరాపల్లి: దేవరాపల్లిలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు వర్షపునీటితో నిండిపోయాయి. ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దేవరాపల్లిలో నాలుగు సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది.

గాయపడిన పాముకు శస్త్ర చికిత్స



శస్త్రచికిత్స అనంతరం పాముతో పశువైద్యాధికారి శివకుమార్

మాడుగుల రూరల్: మాడుగుల పట్టణంలో ఒక గుడిలో బుధవారం పాము (జెర్రిగొడ్డు) ప్రవేశించింది. భక్తులను చూసి గాబరాగా వెళ్లే సమయంలో షట్టర్‌లో ఇరుక్కుంది. దీంతో పాము నడుము భాగం నలిగిపోయింది. ఈ సమాచారాన్ని తెలుసుకున్న స్నేక్ క్యాచర్ పవన్ పామును పట్టుకుని వైద్యం అందించేందుకు కె.జె.పురం పశువైద్య కేంద్రానికి తీసుకెళ్లాడు. పశువైద్యాధికారి శివకుమార్ పాము నడుము భాగానికి శస్త్రచికిత్స నిర్వహించారు. అనంతరం పామును స్నేక్ కేచర్ పవన్ అటవీ ప్రాంతంలో విడిచాడు.

హ్యాట్రిక్‌పై భారత్ కన్ను

- నేడు దక్షిణాఫ్రికాతో అమీతుమీ
- విశాఖలో తొలి సమరానికి సర్వం సిద్ధం

విశాఖ స్పోర్ట్స్/పీఎంపాలెం: విశాఖ నగరంలో క్రికెట్ సందడి నెలకొంది. అంతర్జాతీయ మహిళా క్రికెట్‌కు తొలిసారిగా వేదికగా నిలిచిన సందర్భంలో.. నగరం మొత్తం ఉత్కంఠతో ఎదురుచూస్తోంది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్‌లో భాగంగా.. హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా భారత జట్టు గురువారం పటిష్టమైన దక్షిణాఫ్రికాతో తలపడనుంది. పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖర రెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ డే అండ్ నైట్ మ్యాచ్ కోసం సర్వం సిద్ధమైంది. ఇప్పటికే ఇరు జట్లు స్టేడియంలో ఫ్లడ్‌లైట్ల వెలుతురులోనే ప్రాక్టీస్ చేసుకున్నాయి.

విజయోత్సాహంతో బరిలోకి భారత్

ప్రస్తుత టోర్నీలో భారత జట్టు అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో శ్రీలంకపై 59 పరుగులు, చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 88 పరుగుల భారీ తేడాతో ఘన విజయాలు సాధించింది. విశాఖ వేదికగా అదే జోరును కొనసాగించాలని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ సేన పట్టుదలగా ఉంది. బ్యాటింగ్‌లో హర్లీన్(94 పరుగులు), దీప్తి శర్మ (78 పరుగులు), ప్రతీక (68 పరుగులు) సూపర్ ఫామ్‌లో ఉండగా, బౌలింగ్‌లోనూ దీప్తి శర్మ (6 వికెట్లు), క్రాంతి, స్నేహ రాణా (చెరో 4 వికెట్లు) ప్రత్యర్థులకు సింహస్వప్నంలా మారారు. బ్యాటింగ్‌కు స్వర్గధామమైన విశాఖ పిచ్‌పై వీరు మరింతగా రాణిస్తారని అభిమానులు ఆశిస్తున్నారు.

అభిమానుల కోలాహలం

విశాఖ మహిళల ప్రపంచ కప్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వడం ఇదే ప్రప్రథమం. దీంతో నగర క్రీడాభిమానుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. భారత్, దక్షిణాఫ్రికాతో పాటు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ వంటి దిగ్గజ జట్లు ఇక్కడ ఆడనుండటంతో స్టేడియం పరిసరాల్లో పండగ వాతావరణం నెలకొంది. స్థానిక యువ క్రీడాకారిణులను ప్రోత్సహించే దిశగా స్టేడియంలోని ఒక స్టాండ్‌కు భారత మహిళా క్రికెట్ దిగ్గజం, హైదరాబాదీ మిథాలీ రాజ్ పేరు, ఒక ప్రవేశ ద్వారానికి ఆంధ్ర క్రీడాకారిణి కల్పన పేరు పెట్టడం విశేషం. ఇది భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందని నిర్వాహకులు భావిస్తున్నారు.

భారీ బందోబస్తు..

ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. స్టేడియం లోపల, వెలుపల సుమారు 1,100 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పీఎంపాలెం సీఐ జి.బాలకృష్ణ తెలిపారు. ప్రతి ప్రవేశ ద్వారం వద్ద సీఐ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు, వరుణుడు అంతరాయం కలిగించే అవకాశం ఉన్నప్పటికీ.. స్టేడియంలో ఉన్న ఆధునిక డ్రైనేజీ వ్యవస్థతో వర్షం నీరు త్వరితగతిన బయటకు వెళ్లే ఏర్పాట్లు ఉన్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవనంత వరకు మ్యాచ్ ఫలితం తేలే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

విద్యార్థుల స్థాయికి తగ్గట్లు బోధించాలి



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్

- నూతన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో అల్లూరి కలెక్టర్ దినేష్‌కుమార్

సబ్బవరం: ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులుగా ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ, విద్యార్థుల స్థాయికి తగ్గట్లు బోధన చేసి, వారిని బాధ్యతాయుత పౌరులుగా తయారు చేసేందుకు కృషి చేయాలని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో డీఎస్సీ–2025లో ఎంపికైన ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఇండక్షన్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. నూతన ఉపాధ్యాయులకు ఏ విధంగా శిక్షణ అందిస్తున్నారో తెలుసుకుని, బోధనలో అవలంబించాల్సిన పద్ధతులను సూచించారు. విద్యార్థుల స్థాయికి తగ్గట్లు బోధన చేయాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ప్రదర్శించిన టీఎల్ఎం ప్రాజెక్టులను పరిశీలించారు. ముందుగా వర్సిటీ ఉపకులపతి కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. వర్సిటీలో కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దామోదరం సంజీవయ్య, మహాత్మా గాంధీ విగ్రహాలను సందర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులను సూచించారు. కార్యక్రమంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, ఏపీసీ డాక్టర్ ఎ.అప్పలనాయుడు, అల్లూరి జిల్లా డీఈవో బ్రహ్మాజీ, ఏఎంవో కెజియా, కోర్సు డైరెక్టర్ సింహాచలం, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, ఎంఈవో రవీంద్రబాబు, ట్రైనీలు, డీఆర్పీలు, సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జస్టిస్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాదిని శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు

అనకాపల్లి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై షూ విసిరిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం పార్టీ శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన న్యాయమూర్తి పై మతోన్మాది రాకేష్ కిషోర్ షూ విసరడం క్షమించరాని నేరమన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపైనే దాడి చేయడం ప్రజాస్వామ్యానికి తీవ్రమైన మచ్చలాంటిదని తెలిపారు. అభ్యుదయవాదులు, మేధావులు ఇలాంటి ఘటనలను ఖండించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు బి.పరమేశ్వరి, వియ్యపు రాజు, కోరిబిల్లి శంకరరావు, సత్యనారాయణ, లక్ష్మి పాల్గొన్నారు.

పోషకాహారంతో తల్లీబిడ్డ ఆరోగ్యం



స్టాల్ పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి

పరవాడ: పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. వెన్నలపాలెం ఓల్డ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషకాహార మాసోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్న ఫుడ్ స్టాల్స్ ప్రాముఖ్యతను తల్లులు, గర్భిణులు, బాలింతలకు వివరించారు.తల్లి పాల ప్రాధాన్యతతో పాటు ఇంటి పరిసరాల్లో మొక్కల పెంపకం గురించి తెలిపారు. అంతర్జాతీయ కిశోర బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12న పరవాడ బాలికల జెడ్పీ హైస్కూల్లో కిశోర బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి, అదే రోజు విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జీఎస్టీ ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ తెలియాలి'

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న జీఎస్టీ 2.0 ప్రయోజనాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు విద్యార్థులు కృషి చేయాలని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ బాబు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సూపర్ జీఎస్టీ 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం జరిగిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. జీఎస్టీ అమలు తీరుతెన్నులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో ర్యాలీ నిర్వహించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు బుధవారం 158 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,500	5,200
రెండో రకం	3,930	4,430
మూడవ రకం		నిల్

అనకాపల్లి సినిమాలు

రాజా	:ఇడ్లీ కొట్టు
సత్యనారాయణ స్క్రీన్-1	: కాంతార
సత్యనారాయణ స్క్రీన్-2	: టన్నెల్
పర్తిసాయి	: ఓజీ
షిర్డిసాయి	: ఓజీ
వెంకటేశ్వర	: అర్జున చక్రవర్తి
రామచంద్ర	: మిరాయ్

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 97 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-21, బి పాజిటివ్-30, ఒ పాజిటివ్-40, ఏబీ పాజిటివ్-6 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 332 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 397 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924–223595)ని సంప్రదించవచ్చు.



వసతి గృహం వద్ద నిల్వ ఉన్న వర్షపునీరు



ధ్వంసమైన సోలార్ విద్యుత్ పలకలు



బెడ్లు లేని వసతి గృహం

వసతి గృహం.. సమస్యలతో సతమతం

- ఇబ్బందులకు గురవుతున్న బీసీ హాస్టల్ విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



కశింకోట బీసీ బాలుర వసతి గృహం భవనం



నిరుపయోగంగా ఉన్న మరుగు దొడ్లు

కశింకోట: కనీస సౌకర్యాలు కరవై స్థానిక బీసీ బాలుర సంక్షేమ వసతి గృహం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రహరీ లేక రక్షణ కరవైంది. బెడ్లు లేక కటిక నేల మీదే నిద్రిస్తున్నారు. ప్రాంగణంలో వర్షపు నీరు నిల్వ ఉండిపోవడంతో అవస్థలు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో గల బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 52 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరు స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుతున్నారు. గతంలో 80 వరకు విద్యార్థులు ఉండేవారు. సమస్యలు తిష్టవేయడంతో హాస్టల్‌లో చేరేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు.

నిత్యం పశువులు, పందుల సంచారం

ప్రహరీ లేకపోవడంతో నిత్యం పశువులు, పందులు హాస్టల్ ప్రాంగణంలో సంచరిస్తున్నాయి. పందులు ఎక్కువగా సంచరిస్తుండడంతో వ్యాధులు ప్రబలుతాయని విద్యార్థులు భయాందోళనలు చెందుతున్నారు.

- 14 మరుగుదొడ్లకు గాను ప్రస్తుతం పది వినియోగంలో ఉన్నాయి. సురక్షిత తాగునీటి సదుపాయం లేదు. బోరు నీటినే మరిగించి ఇస్తున్నారు. ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.
- వసతి గృహం ఆవరణ పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వాటి వల్ల విద్యార్థులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.
- బెడ్లు లేకపోవడంతో కటిక నేల మీదే విద్యార్థులు నిద్రించాల్సి వస్తోంది. జిల్లాలోని వివిధ వసతి గృహాల్లో అదనంగా మిగిలిపోయిన బెడ్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ఇక్కడకు తరలించి ఏర్పాటు చేస్తే ఉపయుక్తంగా ఉంటుందని విద్యార్థులు తల్లిదండ్రులు చెబుతున్నారు.
- దుప్పట్లు ఇవ్వకపోవడంతో తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న వాటిని విద్యార్థులు వినియోగిస్తున్నారు. రానున్నది చలి కాలం కావడంతో చలిని తట్టుకోవడానికి అనువైన దుప్పట్లను ప్రభుత్వం అందించాల్సి ఉంది.
- ఇక వసతి గృహానికి అన్ని వేళల విద్యుత్ సదుపాయం కోసం సోలార్ దీపాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి కోసం అమర్చిన పలకలు చాలా కాలంగా పనిచేయడం లేదు. దెబ్బతిని నిరుపయోగంగా మారాయి.
- బాత్‌రూమ్‌లు లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట స్నానం చేయాల్సివస్తోంది. ప్రస్తుతం వసతి గృహానికి ఇన్‌చార్జి సంక్షేమ అధికారి ఉన్నారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేయడానికి రెగ్యులర్ అధికారిని నియమించాల్సి ఉంది. వసతి గృహంలో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు,వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు

ప్రహరీ నిర్మాణానికి చర్యలు

బాలుర బీసీ వసతి గృహానికి ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇటీవల ఇంజినీరింగ్ సిబ్బంది వచ్చి కొలతలు తీసి, పరిశీలించి వెళ్లారు. తాజాగా రగ్గులను అందించాం. ప్రస్తుతం విద్యుత్ సమస్య లేదు. బెడ్లను సమకూర్చాల్సి ఉంది.

–జె.నారాయణరావు, ఇన్‌చార్జి బీసీ బాలుర వసతి గృహం సంక్షేమ అధికారి, కశింకోట.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులతో జీవీఎంసీ పెద్ద హైస్కూల్ విద్యార్థులు

అనకాపల్లి టౌన్: స్థానిక జీవీఎంసీ పెద్ద హైస్కూల్‌లో 55 మంది విద్యార్థులకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా స్థిరపడిన అనకాపల్లికి చెందిన వి.రాజేష్ క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. క్రీడాకారుడైన రాజేష్ క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు రూ.25 వేల విలువైన దుస్తులను ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మాజీ, వ్యాయామ ఉపాధ్యాయుడు వి.నరసింహం చేతుల మీదుగా అందజేశారు.

వేంకటాద్రిపై ప్రత్యేక పూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: చాతుర్మాస్య దీక్షలో భాగంగా స్థానిక వేంకటాద్రిపై బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో సుందరకాండ హవనం చేశారు. అనంతరం శ్రీనివాస నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. ముందుగా స్వామివారికి గోత్రనామార్చనలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేయండి

- ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, ఇతర నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

అనకాపల్లి: మాకవరపాలెం మండలంలో నిర్మాణంలో ఉన్న వైద్యకళాశాల భవనాల పరిశీలనకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం రానున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డులో గల వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, పార్టీ నాయకులతో బుధవారం ఆయన మాట్లాడారు. పర్యటనకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అనకాపల్లి నియోజకవర్గంలో కొత్తూరు, తాళ్లపాలెం జంక్షన్ల వద్ద ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు బొడ్డేడ శివ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. నర్సీపట్నం నియోజకవర్గ మాకవరపాలెం మండలంలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాల పరిశీలనకు గురువారం జగన్ రానున్నారని చెప్పారు. విశాఖ విమానాశ్రయం నుంచి అనకాపల్లి మండలం కొత్తూరు ఏఎంఎఎల్ కళాశాల జంక్షన్, కశింకోట మండలం తాళ్లపాలెం జంక్షన్ మీదుగా మాకవరపాలెం వెళతారని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన



వేల్పులవీధిలో సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి

అనకాపల్లి: నాణ్యతాప్రమాణాల్లో రాజీ పడకుండా సీసీ రోడ్డులు, డ్రైనేజీ పనులు చేపట్టాలని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ఆధ్వర్యంలో వార్డు పరిధిలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టిన మిర్యాలకాలనీ 4వ వీధి, వేల్పులవీధిలో శివాలయం వెనుక సీసీ రోడ్డు నిర్మాణాలకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు పరిధిలో మరి కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరలో ఆమోదం పొందేందుకు జీవీఎంసీ ప్రధానకమిషన్, మేయర్ సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొణతాల మురళీకృష్ణ, నడిశెట్టి మధు, ఉగ్గిన అప్పారావు, బుద్ద వెంకటరావు, యల్లపు నానాజీ, రేబాక స్వామి, కొడుకుల సుబ్రహ్మణ్యం, ఇంజరపు వెంకటరావు, కొంకి శ్రీరామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు



తాళ్లపాలెం కూడలిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కశింకోట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా జాతీయ రహదారి వెంబడి పలు గ్రామాల్లో ఆయనకు స్వాగతం పలుకుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. కశింకోట, బయ్యవరం, జమాదులపాలెం, ఉగ్గినపాలెం, తాళ్లపాలెం, జి.భీమవరం, కన్నూరుపాలెం ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు, నాయకులు వీటిని ఏర్పాటు చేశారు. తాళ్లపాలెం కూడలిలో పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీల ఏర్పాటుకు పోలీసులు అభ్యంతరం తెలుపుతున్నారని శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఆటోల్లో ప్రజలను తరలించరాదని ఆటో కార్మికులను, పార్టీ నాయకులను పోలీసులు హెచ్చరించి రోడ్ షోకు జనం రాకుండా ప్రయత్నిస్తున్నారని పార్టీ శ్రేణులు తెలిపారు.

సందడిగా జాతీయ బాలికా దినోత్సవం



వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో సబ్బవరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం-1, 2 ప్రాంతాల్లో ఈ వేడుకలను జరిపారు. పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పలు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు అవగాహన

పరవాడ: జాతీయ కిశోర బాలికల దినోత్సవంలో భాగంగా నాయుడుపాలెం సచివాలయం పరిధి మెట్టపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు బుధవారం ఆటల పోటీలు, సైబర్ నేరాలు, రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలకు ఈ నెల 12న బహుమతులు అందించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణి తెలిపారు. కార్యక్రమంలో నాయుడుపాలెం సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కశింకోటలో భారీ వర్షం



భవానీ కాలనీలో నిలిచిన వర్షం నీరు



అగ్రహారం రోడ్డులో ప్రవహిస్తున్న వర్షం నీరు

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలైన భవానీ కాలనీ, అగ్రహారం, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, స్టేట్ బ్యాంకు రోడ్డు తదితర ప్రాంతాలు నీట మునిగాయి. గవరపేట, కనక మహాలక్ష్మి వీధి, కస్పావీధి తదితర ప్రాంతాల్లో మురుగు కాలువలు నిండిపోయి వాటిలో నీరు వర్షపు నీటితో కలిసి రోడ్డుపై ప్రవహించింది. కశింకోట, బయ్యవరం గ్రామాల్లో జాతీయ రహదారి పక్కన పల్లపు ప్రాంతాల్లో నీరు ప్రవహించడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం కూడా భారీ వర్షం కురిసింది.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



కశింకోట మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగ లక్ష్మి



హాజరైన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు

- కశింకోట మండల సమావేశంలో కోరిన సభ్యులు

కశింకోట: విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుచేసిన కశింకోటలో విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని పలువురు సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ కలగ లక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి మాట్లాడుతూ కశింకోట ప్రాంతంలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి , నాణ్యమైన విద్యుత్‌ను అందివ్వడానికి ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి సంబంధించి స్థలం మంజూరు చేసిన విషయంపై తీసుకున్న చర్యల గురించి సభలో ఏఈ ప్రకాష్‌ను వారు ప్రశ్నించారు. ఈ అంశం కలెక్టర్ వద్ద ఉందని, దీని గురించి ఆమె దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కశింకోట వద్ద శారదా నది అవతల పెనుగాలులకు విరిగిపోయిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించకపోవడంతో పది రోజులుగా విద్యుత్ సరఫరా లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని, వీటిని సత్వరమే పునరుద్ధరించాలని కోరారు. ఇందుకు చర్యలు చేపడతామని ఏఈ బదులిచ్చారు. మండలంలోని ఉగ్గినపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 500 ఎకరాల డీ ఫారం పట్టా భూములను వెబ్ ల్యాండ్‌లో చేర్చి, వారికి ప్రభుత్వ పథకాలు అందించడానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు కోరారు. కశింకోట పూసర్ల వీధిలో డ్వాక్రా సంఘం సీఏవో సమస్యపై అడిగితే సవ్యంగా సమాధానం చెప్పకుండా తనను అగౌరవపరిచారని కశింకోట ఎంపీటీసీ సభ్యురాలు యల్లపు వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేస్తూ వెలుగు ఎంపీఎంను సభలో నిలదీశారు. దీంతో ఇటువంటి సమస్యలు పునరావృతం కారాదని, ఎంపీటీసీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చి గౌరవించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీవో సీహెచ్.చంద్రశేఖర్‌రావుకు సూచించారు. విద్యార్థులు సకాలంలో పాఠశాలలకు చేరేలా ఆర్టీసీ బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని ఉగ్గినపాలెం సర్పంచ్ గున్నయ్యనాయుడు ఆర్టీసీ సూపర్ వైజర్ పీఎస్ రావును కోరారు. గ్రామాల్లో సారా తయారీని అడ్డుకునేందుకు, బెల్టు దుకాణాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులను కోరారు. తాళ్లపాలెంలో రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిల నుంచి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని కోరారు. పంచాయతీ రాజ్ డీఈ వేణుగోపాలరావు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పలువురు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికీ రోజుల తరబడి తిప్పలు



తాడి మూడు మదుంల వద్ద గెడ్డలో ప్రవహిస్తున్న ఊటనీరు

పరవాడ: తాడి మూడు మదుంల వద్ద గెడ్డ పరుజు పైనుంచి నిత్యం ప్రవహిస్తున్న వర్షపు నీటితో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఏ మాత్రం వర్షం పడినా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు ఇక్కడ రోడ్డుపై పరుజు మీదుగా ప్రవహిస్తోంది. వర్షం ఆగిపోయినా నిత్యం ఊట కారణంగా రోజుల తరబడి తాడి, చినతాడి, పెదతాడి గ్రామాల ప్రజలతో పాటు ఫార్మాసిటీలో పనిచేస్తున్న కార్మికులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడుతున్న సమయంలో ఈ రహదారి మీదుగా ఫార్మాసిటీ, తాడి గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. పరుజు పైనుంచి ప్రవహిస్తున్న నీటిలో ద్విచక్ర వాహనాలు పూర్తిగా మునిగిపోతుండటంతో తరచూ రిపేర్లకు వస్తున్నాయని వాపోతున్నారు. తాడి శివారు గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో లంకెలపాలెం, అనకాపల్లి, గాజువాక ప్రాంతాల్లోని ఆస్పత్రులకు చేరుకోవాలంటే నాలుగైదు కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. తమ ఇబ్బందుల్ని గుర్తించి ఇక్కడ పరుజు వద్ద రోడ్డును ఎత్తు చేసి వర్షపు నీరు దిగువ నుంచి ప్రవహించడానికి వీలుగా పైపులను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గ్రంథాలయం కమిటీ సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న రత్నాకర్

అనకాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) డైరెక్టర్ పి.రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం గౌరీసేవా సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతను ప్రజా ఉద్యమంగా మార్చే లక్ష్యంతో దేశవ్యాప్తంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. నిరుపయోగంగా ఉన్న వస్తువులు, చెత్తా చెదారం తొలగించాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడం లక్ష్యంగా పెట్టుకోవాలని, పారిశుద్ధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెప్పారు. ప్లాస్టిక్‌కు స్వస్తి చెప్పేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ప్రతిఏటా 100 గంటలు లేదా వారానికి రెండు గంటలు శ్రమదానం చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రంథాలయం సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బుద్ద శ్రీనివాసరావు, గ్రంథాలయ కోశాధికారి ఆడారి మోహనరావు, సభ్యులు పాల్గొన్నారు.